

# అమెరి'కాకమ్మ'కథలు

## వంగూరి చిట్టెన్ రాజు



# "అహానికి ఆహారం"-ఏమో?

అమెరికాకమ్మ కథలు- 3

నేను ఫిబ్రవరిలో ఇండియా వెళ్ళినప్పుడు గమనించినది ఏమిటంటే అది అక్కడ ఉన్నవాళ్ళు రోజూ అనుభవించేదే ఎన్టీర్ ఇవ్వబోయి మానేసిన, చంద్రబాబు ఇవ్వలేక ఇవ్వని కిలో రేషను బియ్యం రెండు రూపాయలకే రాజశేఖరుడు ఇచ్చినా టమాటోలూ, ఉప్పు, చింతపండు మొదలైన వాటి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇండియాలో ఉన్న నాలుగు వారాలూ వారాలూ చేసుకుని నా పొట్ట పోసుకున్నాను కాబట్టి ఈ ఆహారం ధరలు నాకు ఎక్కువ పట్టలేదు. ఎందుకైనా మంచిదని నన్ను పోషించిన వారు లోలోపల నన్ను దూషించుకున్నా, పైకి నాకు వినపడేటట్టు దూషించే లోపుగా వెనక్కి అమెరికా వచ్చేశాను. కానీ మూడు రోజుల "అహం ఆహారం" ఖరీదు తో ఒక జలయజ్ఞం నిర్వహించవచ్చు సుమా అని తెలిసిపోయింది. అంత ఖర్చుపెట్టినా చివరకు మిగిలినది ఏమిటీ అనే సమాధానం లేని ప్రశ్న కూడా నాకు మిగిలింది. మా క్వీన్ విక్టోరియా వేసవికాలంలో వడియాలూ, అప్పడాలూ ఎండబెట్టుకోడానికి కొన్ని శాలువాలు కూడా మిగిలిపోయాయి. ఈ మూడు రోజుల "అహానికి ఆహారం" కి మరో పేరు తెలుగు సాహితీ సదస్సు.

అన్నట్టు, ముందే చెప్తున్నాను. మరొక ఆర్నెల్లో, ఏడాదో దాకా మళ్ళీ సాహితీ సదస్సు మాట ఎత్తను. సత్కారాలూ, సన్మానాల గురించి కామెడీ రాయను. ఈ ప్రగాఢమైన నిర్ణయానికి దానికి రెండు కారణాలు. ఒకటేమో హైదరాబాదులో అడుగుపెట్టగానే ఒకరిద్దరు నన్ను చూసి, "ఈ సారి కూడా మాకు తెలిసిన ఆ సబ్జెక్ట్ మీదే రాస్తావేమో. బోరుకొట్టి చస్తున్నాం. కాస్త తెలుగు వాళ్ళని ఒదిలేసి తెల్లవాళ్ళ మీదో, ఒబామా మీదో రాయకూడదా" అన్నారు. రెండో కారణం

ఫిబ్రవరిలో జరిగిన రెండవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు విశేషాలు ఇంకా "హాట్, హాట్" గా నా బుర్రలో ఉన్నప్పుడు రాయకపోతే, ఇది వరకటి వాటిల్లాగే, మిగిలిన వాళ్ళలాగే నేను కూడా ఈ సదస్సులో ఏం జరిగిందో, ఎందుకు జరిగిందో మర్చిపోతాను కదా! అందుచేత ఈ సారికి ఇలా కానిచ్చేస్తాను. నన్ను క్షమించి ఒదిలెయ్యండి. మరొక కారణం ఈ ఒబామా గారు అస్మదీయుడా, తస్మదీయుడా..అనగా ఆంధ్రాకి ఉపయోగపడతాడా లేక హెచ్ 1 వీసాలూ, బేబీ సిట్టింగ్ విజిట్లూ తగ్గించేస్తాడో

తెలియకుండా ఆయన్ని ఏ విషయంలో లో విమర్శించాలో, పొగడాలో తెలియదు కదా! ఆ మాటకొస్తే ఎవరినైనా పొగడడం నాకే కాదు, మన తెలుగు జాతికే అవమానం, ఒబామాయే కాదు, ఆయన ఫాదర్, మదర్ మొదలైన వాళ్ళందరూ ఫారినర్స్ కాబట్టి వాళ్ళు ఎలాటివాళ్ళయినా ఫారినర్స్‌ని పొగడడం మన దేశభక్తిని చాటుగోవడంతో సమానం.

ఇక అసలు విషయానికి వస్తే, నా చిన్నప్పుడు లెక్కల మేస్టారు ఒక సిద్ధాంతం చెప్పేవారు. ఒక పోజిటివ్వూ, ఒక నెగెటివ్వూ అయితే మిగిలేది సున్నా అని ఆయన ప్రతిపాదన. దానికి ఏదైనా ఉదాహరణలు ఇవ్వగలరా అని యాభై ఏళ్ళ క్రితం ఆయన ప్రశ్నకి ఇప్పటికి సరి అయిన ఉదాహరణ దొరికింది. అంతే కాదు, ఆయన సిద్ధాంతానికి మరికొన్ని ఉప సిద్ధాంతాలు కూడా కలపవచ్చు అని తెలిసింది.

ఈ సాహితీ సదస్సు విషయంలో సాహిత్యం పోజిటివ్ అయితే సత్కారాలు నెగెటివ్ అనమాట. ఫిబ్రవరి 14, 15 16వ తారీకులలో జరిగిన రెండవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులో ఎంత వద్దనుకున్నా ఈ రెండూ కలపక తప్పలేదు కాబట్టి సాహిత్యమూ, ఎడాపెడా శాలువాల పంపిణీ కార్యక్రమమూ ఒకదానికొకటి కేన్సిల్ అయిపోయి మొత్తానికి మిగిలినది సున్నా ఏమో అనియూ, మా లెక్కల మేస్టారి సిద్ధాంతం కరెక్టే అనియూ అనుకోవాలి. పైగా ఇటువంటి సదస్సులు ఆంధ్రాలో ఎవరికీ అక్కరలేదనీ కేవలం స్వంత "గోరోజనమూ" మరియూ ఆర్గనైజర్ల "అహానికి ఆహారం" మాత్రమే సుమా నేను కొత్తగా ప్రతిపాదిస్తున్న పాత ఉప సిద్ధాంతం. ఏ లోకాన ఉన్నారో తెలియదు కానీ మా లెక్కల మేస్టారు నా ఈ "బ్రిలియంట్" ప్రతిపాదన వింటే "అవును సుమా! ఈ పొట్టి వెధవ చెప్పేది నిజమే." అని మెచ్చుకుంటారనే అనుకుంటాను. ఎటొచ్చీ నా అభిప్రాయాన్ని ఒప్పుకోక, "మరీ అంత నెగెటివ్‌గా మాట్లాడకయ్యా ఎన్నారై మహాశయా, సభలో మూడు రోజుల పాటు వంద మంది సాహిత్యం మాట్లాడారు కదా!" ఈ మాత్రం కూడా ఎవరు చేస్తున్నారూ ఈ మధ్య?" అని నన్ను అనునయించే వారికి ఈ "అహానికి ఆహారం" ఖరీదు పది వేల డాలర్లని తెలియదు. క్వీన్ విక్టోరియాకి చెప్పే ధైర్యం నాకు లేదు.

ఇటువంటి సాహిత్యపరమైన కార్యక్రమాలు కేవలం నిర్వాహకుల గొప్పకోసం, పేరు తెచ్చుకోవాలనే కోరిక కోసం, వారి అహానికి పోషకాహారాలు మాత్రమేమో అని నాకు అనిపిస్తోంది. నిజమైన ఉపయోగం ఉన్నా, అనవసరమైన చిల్లర మల్లర సత్కారాల మధ్య సాహిత్య పరమైన విజయాలు మరుగున పడిపోతున్నాయేమో అని నా అనుమానం. దానికి ముఖ్యమైన కారణం మన న్యూస్ పేపరు, టీవీలలో వారిచ్చే ప్రాధాన్యత సత్కారాలకే కానీ సాహిత్య విజయాలకి కాదు.

ఇంతకీ సదస్సు ప్లానింగు చేస్తున్న టైములో "అందరం కూచుని సాహిత్యం మాట్లాడుకుంటే పోలే?" అని నేనూ 'అలా మాట్లాడిన వాళ్ళందరికీ ఒక శాలువా, జ్ఞాపిక, చాకలెట్లూ కూడా ఇస్తే పోలే?" అని మరొకాయనా మంతనాలాడుకుంటూంటే ఫోన్ ఘంటసాలలా మోగింది. ఎందుకంటే పూర్వం ఫోనులు గణ గణా మోగేవి. ఇప్పుడు ఒక ఫోను భజ గోవిందం పాడుతుంటే, మరొక ఫోను అహ నా పెళ్ళంట పాడుతోంది. ఇండియాలో నాది అద్దె ఫోను కాబట్టి అంతకు ముందు ఓనరు గారు ఎవరి చేత పాడిస్తే నాదీ అదే పాట. ఇప్పుడు ఫోన్ చేసినావిడ పాటేమిటంటే "కిందటి సారి సభలో ఓ చిన్న పువ్వుతో సరిపెట్టేశారు. ఈ సారి అలా కుదరదు" అంటూ ఎలా కుదురుతుందో వివరంగా చెప్పింది. ఆవిడ లిస్టు ప్రకారం స్టేజి మధ్యలో పెద్ద కుర్చీ, అందులో ఎర్రటి పట్టు దుప్పటీ, ముఖ్య అతిథి గారి చేత శాలువా, ప్రారంభకుల చేత దండ, నేను జ్ఞాపిక, మరొకరు సర్టిఫికేటూ, అందరూ కలిసి పుష్పాభిషేకం, దానికి ముందు గంధం, అత్తరు, పన్నీరు ...వెరసి ఆవిడ ఆఖరి డైలాగు "ఇదంతా నా గురించి కాదు సార్. సాహిత్యానికి అమెరికా వారు ఇలా సత్కారం చేస్తే బ్రహ్మాండంగా ఉంటుంది కదా! అందుకూ". అన్నీ చేస్తే మనిషికి ఐదు నిముషాలు ప్రసంగం అరగంట సన్మానం జరగాలి.

"అలాగేనమ్మా, మీరు చెప్పింది నా మొహంలా ఉంది" అని చెప్తే ఆవిడ మొహం ముడుచుకుంటుందేమో అని, ఉట్టినే "అలాగేనమ్మాతో" నా సమాధానం ఆపేసి ఆవిడని సంతోషపెట్టి, నా మొహం నా దగ్గరే దాచుకున్నాను. ఇలా అనేక మంది అభిప్రాయాలూ, కోరికలూ విని, ఇక స్టేజి ఎక్కిన ప్రతీవారికీ ఏదో రకమైన సత్కారం చెయ్యకపోతే ఆడియన్స్‌లో కూచున్న అరడజను మందికీ మేక తోలు కప్పాలేమో అనిపించి ఒప్పేసుకున్నాను.

తరవాతి అంతర్జాతీయ స్థాయి చర్చ తెలుగు కథ శతవార్షికోత్సవాల గురించి అని నేను ఆ మీటింగులో ప్రకటించగానే ఒకాయన చెయ్యి ఎత్తాడు. నన్ను కొట్టడానికేమో అని ముందు భయపడ్డాను కానీ, పాపం ఆయన నిజంగానే "ఈ సత్కారము వక్త గారు స్టేజీ ఎక్కగానే చేయుదుమా, లేక ప్రసంగించిన తర్వాత చెయ్యాలా" అనే ప్రగాఢమైన సందేహం వెలిబుచ్చారు. "మీకేమన్నా పిచ్చా? వక్త గారు మాట్లాడడానికి ముందే దండ వేసేస్తే, ఆయన వెంఠనే ఊళ్ళో జరుగుతున్న మరో సభకి మన దండా, పుష్పగుచ్ఛమూ పట్టుకుని పారిపోతాడు కదా! అంచేత ఆయన ప్రసంగం పూర్తిచేశాకే ఆయన పనిపట్టాలి" అని మరొకాయన సలహా ఇచ్చాడు. "పోదురూ, మీరు మరీనూ, వక్త గారు చెత్తగా మాట్లాడి, అందరిచేతా చప్పట్లు కొట్టించుకుని చెప్పులు లెక్కపెట్టుకుంటూ ఉంటే మనం ఏ మొహం పెట్టుకుని దండ వేయుదుమూ?" అని ఇందాకటి ఆర్గనైజరు గారి శత్రువు గారైన ఆర్గనైజరీమణి ఆ సలహాని తిరస్కరించి నా వేపు విజయగర్వంతో చూసింది.. వాళ్ళిద్దరూ భార్యాభర్తలనీ, ఏనాడూ ఒకరి మాట మరొకరు ఒప్పుకోరనీ నాకు తరవాత తెలిసింది. అప్పుడు నేను కాంప్రమైజేషనుగా వక్త ఇంకా స్టేజి మెట్ల మీద ఉండగానే శాలువా కప్పేసి సగం సత్కారాలూ, వక్త గారు మాట్లాడేసి ఈ దండా, శాలువ స్టేజికి ఎటువైపునుండి ఎవరు వేస్తారో తెలియని చిత్తచాంచల్యంతో మైకుని వదలివెళ్ళలేని పరిస్థితిలో మిగిలిన సగం సత్కారాలూ ఏర్పాటు చేసి నా బుర్ర బ్రిలియంట్ అని మరొక సారి నిరూపించుకున్నాను.

టూకీగా చెప్పాలంటే ఈ రెండవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు సాహిత్యపరంగా ఒక మోస్తరు గానూ, రచయితల్ని గుర్తించి గౌరవించే విషయాలలో చాల బాగానూ జరిగాయి. ముఖ్యంగా రెండవ రోజు జరిగిన తెలుగు మహిళా రచయిత్రుల సమ్మేళనం పొద్దున్న తొమ్మిది నుంచి రాత్రి తొమ్మిది దాకా ఎక్కడా విరామం లేకుండా మొత్తం సాహిత్యపరంగా జరగడం నిజంగా చాలా బావుంది. తెలుగు కథ శతవార్షికోత్సవాలు ఇంకా బాగా చేసి ఉండవచ్చును అనిపించింది. మొత్తం సదస్సుకు హైలైట్ గొల్లపూడి గారి జీవిత సాఫల్య పురస్కార సభ. డా. అనసూయా దేవిగారి జీవిత సాఫల్య పురస్కార సభ కూడా చాలా బాగా జరిగింది. ఈ విశేషాలన్నీ..అంటే ఫొటోలూ, పత్రికల వారి రిపోర్ట్‌లూ ‘కౌముది‘మెయిన్ పేజీలో చూడండి.

♣